రామబ్రహ్మంగారికి 'స్వాతంత్ర్యంవచ్చేనని సభలేచేసి సంబర పడగానే సరిపోదోయి' అనే మహాకవి పాట చివరి వీడ్కోలు పలికింది. రామబ్రహ్మంగారికి లోకంనుండి నిజమైన స్వాతంత్య్రం నేడు లభించింది.

'అర్హతలు లేనివారు అందలాలెక్కి పూజలందుకుంటున్న నేటి కాలంలో నిజమైన స్వాతంత్ర్యయోధులు దేశభక్తిపరాయణులకు గుర్తింపులభించేకాల మెప్పుడొస్తుందో'

(మనుగడ- మే 83 సంచిక)

# 7. ఇది ముగింపు కాదు

విజయలక్ష్మి మనసు కుతకుత ఉడుకుతుంది. హృదయ మంతా భరింపరాని వేదనాభరితమై యుంది. అవమానాగ్నితో శరీరం దహించుకు పోతుంది. దూరంగా వినబడుచున్న బ్యాండు ధ్వని తన హృదయంపై సుత్తితో బాదిన ధ్వనిలా తోస్తుంది. సన్నాయనాదం తనకు చివరిసారి వీడ్కోలు పాట వలె తోస్తుంది. ఆ బ్యాండు ధ్వని తన ప్రాణాధికంగా ప్రేమించిన మనోహర్ పెళ్ళిది. 'మనోహర్ నన్నెందు కిలా అన్యాయం చేస్తున్నాడు? నేనేం తప్పుచేసాను? అతననే సర్వస్వమని నమ్మాను. ఇద్దరం పెళ్ళిచేసుకుంటామని ఎన్నిసార్లు బాసలు చేసికొన్నాము- ఆ బాసలన్ని ఏమైనాయి? తుచ్ఛమైన కట్నం ముందు ప్రేమ మమకారాలకుతావేలేదా? బాసలకర్థమే లేదా?

ఎన్నో బాసలుచేసి వేరే యువతిని పెండ్లాడుతున్నప్పుడు నేనెందుకు వేరొకర్ని పెండ్లాడకూడదు? అతనికోసం ఇంతగా పరితాపం చెందవలసిన అవసరమేమున్నది?' అని విజయలక్ష్మి తన మనస్సు కెన్ని విధాలుగా సమాధానం చెప్పుకొన్నా తృప్తి కలగడంలేదు. మనోహర్ లేని బ్రతుకు ఏదో వెలితిగా తోస్తుంది. మనోహర్ ప్రక్కన మరో అమ్మాయిని తన మనస్సు ఊహించుకోలేకపోతూంది.

ప్రేమ ఇంత గొప్పదా? మనస్ఫూర్తిగా ప్రేమించిన వ్యక్తిని మరచిపోవడం సాధ్యంకాదా? ప్రేమ- పెళ్ళి విఫలమైతే ఆత్మహత్య చేసికోవడం తాను పత్రికలలో, నవలలో చదివినప్పుడు అవి కేవలం కల్పితాలనుకొంది. కాని నేడు తన విషయంలో ఏం జరుగుతుంది? తన కర్తవ్యమేమిటి? అని పరిపరి విధాలుగా ఆలోచిస్తూ ఆలోచనాభారంతో బ్రద్దలగుచున్న తలను రెండుచేతులతోనూ గట్టిగా అదిమి పట్టుకొంది. వ్యథాభరితమైన ఆమె మస్తిష్కంలోకి గతం తాలూకు జ్ఞాపకాలు రాసాగాయి.

మనోహర్, తాను క్లాస్‌మెట్స్. నవ్వుతూ నవ్విస్తూ అందరితో సరదాగా ఉండే అతనిపై లక్ష్మికి మొదటినుండి చాలా ఇష్టం. స్కూలు వక్తృత్వపోటీలలో అతడు వరకట్న నిషేధాన్నిగూర్చి, సంఘంలో దురాచారాలనుగూర్చి ధారాళంగా ఉపన్యసించేవాడు. వక్తృత్వ పోటీలలో తానాతనిని మించాలని ఎంత ప్రయత్నించినా తనకు సాధ్యమయ్యేది

—కాలువ మల్లయ్య

కాదు. తానాతనిపై ప్రేమదృక్కులతోచూసేది. అతడుకూడా తనవైపు అనురాగంతో చూసేవాడు. కాని అది పల్లెటూరి పాఠశాల కావడంవల్లనూ, పల్లెలో నియమ నిబంధనలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండడంవల్లనూ వాళ్ళ పరిచయాని కెక్కువ అవకాశం కలుగలేదు. మూగగా ప్రేమించుకున్నారు హెచ్. ఎస్. సి. లో ఇద్దరూ ఫస్టుక్లాసులో పాసయ్యారు. తనది పేద కుటుంబం కావడంవల్ల తన చదువు మాన్పిస్తా నన్నాడు- నాన్నగారు. కాని తాను పట్టుపట్టడంతో పి.యు. సి. లో చేర్పించారు. మనోహర్ కూడా అదే కాలేజిలో తన క్లాసులోనే చేరాడు. అప్పటినుండి వారిద్దరిమధ్య పరిచయం బాగుగా పెరిగింది. వాళ్ళెన్నో విషయాలనుగూర్చి చర్చిం చుకొనేవారు. వరకట్నం విషయంలో, వితంతు వివాహాల విషయంలో వాళ్ళిద్దరి భావాలు దాదాపుగా ఏకీభవించేవి. అతని సన్నిధిలో ఉన్నంతకాల మామెకు సమయ మసలే తెలిసేదికాదు. గంటల తరబడి వాళ్ళమధ్య మాటలుదొర్లేవి. క్రమక్రమంగా వాళ్ళిద్దరిమధ్య పరిచయం ప్రేమగా మా రింది. ఒకరినొకరు చూడంది, ఒకరితోనొకరు మాట్లాడుకో నిది వాళ్లు ఒక్కరోజైనా గడిపేవారుకాదు. అతని అనురాగ పూరిత లాలింపుకు, మాటల్లోని ఆకర్షణ కామె ముగ్ధురాలై పోయేది. అప్పుడే వాళ్ళిద్దరూ ఒకరినొకరు పెళ్ళిచేసుకోవా లని ప్రమాణాలు చేసికొన్నారు. ఇంతలో సంవత్సరం గడి చింది. ఇద్దరూ పాసయ్యారు. పి.యు.సి. యే బలవంతంపై

చదివించిన లక్ష్మి నాన్న అంతటితో చదువు మానిపించాడు. మనోహర్ డిగ్రీలో చేరాడు. మనోహర్ తన డిగ్రీ పూర్తయిన తర్వాత లక్ష్మిని పెళ్ళిచేసుకుంటానన్నాడు. అంతవరకు తమవిషయాన్నెవరితోనూ చెప్పకూడదన్నాడు. లక్ష్మి మనోహర్‌తో తన భవిష్యత్ జీవితాన్నూహించుకుంటూ బంగారు కలలు కంటూ కాలం గడపసాగింది. మనోహర్ డిగ్రీ త్వరగా పూర్తికావాలని మనసారా కోరుకుంది. లక్ష్మి వాళ్ళు బీదవాళ్ళవడంవల్ల చెప్పుకోదగిన సంబంధాలేవీ రాలేదు. వచ్చిన రెండుమూడు సంబంధాలను లక్ష్మి మనోహర్‌పై ఆశతో తిరస్కరించింది.

లక్ష్మి మనస్సు పురివిప్పిన నెమలిలా నాట్యమాడుతుంది. ఆమె సంతోషానికి అవధుల్లేవు. తాను గాలిలో తేలిపోతున్నట్లు, విమానంలో మనోహర్‌తో విహారయాత్ర చేస్తున్నట్లు కలలు కంటున్నది. తాను కోరుకున్న యువకుని పెళ్లాడబోతున్నందుకు ఆమె మనస్సు మనసులో లేదు. 'మనోహర్, నా మనోహర్.. నీవెంత మంచివాడవు. డిగ్రీ పాసయినా నన్ను మరువకుండా పెళ్ళిచేసుకొంటానన్న నీ హృదయమెంత ప్రేమపూరితమని ఆమె గంతులు వేయసాగింది. ఆమె అవధుల్లేని ఆనందానికి కారణం నిన్న మనోహర్ ఆమెతో మాట్లాడడమే. నిన్న మనోహర్ లక్ష్మిని కలిసికొని తాను డిగ్రీ ఫస్టుక్లాసులో పాసైనట్టు చెప్పాడు. తన తల్లిదండ్రులు తనకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నట్టు

కూడా చెప్పాడు. తాను తల్లిదండ్రులతో లక్ష్మినిగూర్చి చెప్పి నట్లు వాళ్ళు రేపు ఆమెను చూడడానికి వస్తున్నట్లు చెప్పాడు. లక్ష్మికి మనోహర్ తల్లిదండ్రులు తనను తప్పకుండా నచ్చు తారన్న నమ్మకముంది. తనకేం తక్కువైంది? చదువుంది, అందముంది, ఒకే కులంవాళ్లు. అంతేకాకుండా మనోహర్ ఇదివరకే తన నిష్టపడ్డాడు_' తనకు రేపే పెళ్లి చూపులనే సరికి సిగ్గు ముంచుకవచ్చింది. సిగ్గుతో తలవంచుకున్న తనను మనోహర్ తన చేతులతో చుబుకాన్ని పైకెత్తినపుడు తానెంత పరవశం చెందింది, ఎంత సిగ్గుమొగ్గయింది? ఇన్నాళ్లుగా ఎంతో ఫ్రీగా మాట్లాడిన తాను అతనితో ఏం మాట్లాడలేక పోయింది. సిగ్గుమొగ్గయిన తనను దగ్గరకు తీసికొని పెదవు లపై సున్నితంగా ముద్దిడినపుడు తానెంత అదృష్టవంతురా లనో అనుకొంది. ఇంతటి విషాదంలోకూడా లక్ష్మి కా సన్ని వేశం జ్ఞప్తికి వచ్చినపుడు మేను పులకరించింది. కాని అదం తా ఒక కలలాగే మిగిలిపోతుందని తానెప్పుడూ ఊహించ లేదు. ఒకసారి విషాదంగా నవ్వుకొని తాను మళ్ళీ గతం లోకి అడుగిడింది.

తెల్లవారి తనకు పెళ్ళిచూపులు జరిగాయి. లేతాకు పచ్చ షిఫాన్ చీర మరియు అదేరంగు జాకెట్టు ధరించిన తనను చూసి తన స్నేహితురాళ్ళు సాక్షాత్తు దివినుండి భువికి వచ్చిన దేవతలా ఉన్నావన్నారు. మనోహర్‌ను తాను కన్నెత్తికూడా చూడలేకపోయింది. మనోహర్ తనను

రెప్పవాల్చకుండా చూడడం తాను కీగ్రంటు గమనించింది. మనోహర్ తల్లిదండ్రులుకూడా తనను నచ్చారు. తర్వాత కట్నాల ప్రసక్తి వచ్చింది. తన తండ్రి కట్నంగా పదివేల రూపాయ లిస్తానన్నాడు. దానికి మనోహర్ తల్లిదండ్రి లేమాత్రం సంతృప్తిపడలేదు. ఆస్తిపాస్తులుండి, డిగ్రీ ఫస్టు క్లాసులో పాసైన తన కొడుక్కి కనీసం పాతికవేలైనా ఇవ్వాలని పట్టుబట్టారు. వేరేవారైతే నలభైవేలు తీసికొనేవాళ్ళమనీ, మనోహర్ ఇష్టపడ్డాడు కాబట్టి పాతికవేలకు ఒప్పుకుంటున్నామని చెప్పారు. కాని పేదవాడైన తన నాన్న అంత డబ్బెక్కడినుండి తేగలడు? తన కొక్కతికే పాతికవే లిచ్చినచో తన తర్వాత ముగ్గురు చెల్లెండ్ల కేమివ్వగలడు? ఎంత ప్రయత్నించినా పదివేలకంటే ఎక్కువ యివ్వలేనన్నాడు నాన్న. దానితో అసంతృప్తిచెందిన మనోహర్ తల్లిదండ్రులు మనోహర్‌ను తీసికొని వెళ్ళిపోయారు. పెద్దల మధ్య ఎంత సంభాషణ జరిగినా మనోహర్ కిక్కురుమనలేదు. బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్న మనోహర్ ఒక్కమాటైనా మాట్లాడ డెందుకని తాను మథనపడింది. తర్వాత మనోహర్ తాను కనపడ్డా తప్పుకు తిరుగుతున్నాడు. ఒకనాడు తామిద్దరూ కలిసే అవకాశం లభించింది. అపుడు తాను తనవిషయం కదిపింది. తాను నిస్సహాయుడిననీ, తన తల్లిదండ్రులు తన మాట వినరనీ జవాబు చెప్పాడు. ఒక్కగానొక్క కొడుకైన

తాను తల్లిదండ్రుల ముద్దుముచ్చట తీర్చాలికదా! అన్నాడు. తాను ఎన్ని విధాల నచ్చజెప్ప ప్రయత్నించినా ఫలితం శూన్యం. తాను తల్లిదండ్రుల నెదిరించి పెళ్ళాడినచో తనకు ఆస్తిలో చిల్లిగవ్వ రాదని, అందువల్ల తనను మరచిపొమ్మని చెప్పి గబగబా వెళ్ళిపోయాడు.

లక్ష్మి కట్టుకున్న గాలిమేడలన్నీ కూలిపోయాయి. ఒక్క సారి తాను అంబరంనుండి అథఃపాతాళానికి గెంటివేయబడట్లు తలచింది. తన భవిష్యత్తు అంధకారబంధురంగా తోచింది. కేవలం కట్నంకొరకు తన బాసలను తేలికగా మర్చిపోయి తన ప్రేమను బలిగొన్నాడు. కట్నంకొరకు తనను తృణీకరించిన అతనిని ఎందుకు మరిచిపోకూడదు. కాని తానెంత ప్రయత్నించినా తన మనఃఫలకంనుండి మనోహర్ రూపాన్ని తొలగించలేకపోతుంది. తన నాతడు కౌగిలిలో బంధించినట్లు అతనితో అప్యాయంగా మాట్లాడుతున్నట్లుతోచేది. తానాతనిని మరచిపోవడానికి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా విజయం సాధించలేకపోతుంది. తాను శారీరకంగా కాకున్నా మానసికంగా అతనికి భార్య అయింది. ఒకరికి సమర్పించిన మనస్సుతో వేరొకరిని పెళ్లాడలేదు. పెళ్లాడినా మనస్ఫూర్తిగా సంసారం చేయలేదు. ఆత్మవంచనతో బ్రతికేకంటే ఆత్మహత్యయే మేలు అని నిర్ణయించుకొంది.

బ్యాండు ధ్వని దగ్గరౌతున్నకొద్దీ ఆమె ఆవేదన అధికం

కాసాగింది. ఏభై వేల కట్నంతో పక్కవూరమ్మాయిని పెళ్ళి చేసుకొంటున్న మనోహర్ నయవంచనను అసహ్యించుకొంది. పెళ్ళి బ్యాండు పక్కవూరికి తన యింటి ముందునుంచే పోతుంది. బ్యాండు పోయినతర్వాత తనలోతాను ఒకసారి విరక్తిగా నవ్వుకుంది. అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇల్లు వదలి వెళ్ళిపోయింది.

తెల్లవారి విజయలక్ష్మి శవం ఊరివెలుపల బావిలో తేలింది. లక్ష్మి ఎందుకు చనిపోయిందో సరియైన కారణం ఎవరికీ తెలియదు. లక్ష్మికి మనోహర్‌తో అక్రమ సంబంధముందని కొందరు, పి. యు. సి. చదివే రోజుల్లో ఎవరో మోసం చేసారని కొందరు, ఆమె గర్భిణి అని మరికొందరు నానా రకాలుగా నిందలు మోపారు. కాని, లక్ష్మి మరణానికి విద్యావంతుడైన ఒక నవయువకుడి చేతగానితనం, సంఘంలోని వరకట్న దురాచారం కారణమని ఎవరూహించలేదు. వరకట్న పిశాచపు విషవలయంలో ఇరుక్కొని యిలాంటి లక్ష్ములు రోజు కెంతమంది ఈ సువిశాల భారతదేశంలో ఆత్మహత్యల పాలౌతున్నారో వారికి తెలియదు.

ఇది ఈ దేశంలో జరుగుతున్న మామూలుకథ కాని, లక్ష్మిలాంటి అమాయకుల కథలకు ముగింపు ఆత్మహత్యేనా? వాస్తవానికి దూరమైన ప్రేమకథలు, యువతరాన్ని ఊహల్లో విహరింపజేసే కాల్పనిక సాహిత్యం. ప్రేమపెళ్ళి, ఆత్మహ

త్యాలు తప్ప వేరే ఏంలేని సినిమాల మత్తులో పడిన ఈనాటి యువతరం అర్థంలేని సెంటిమెంట్స్‌తో నిజాన్ని చూడలేక పోతున్నారు. కూతురు శీలంతో అతిథిసేవలుచేసే తండ్రులు, భార్యను వేలం వేసి అమ్మిన భర్తలు ఆదర్శ పురుషులుగా పరిగణింపబడుతున్న ఈ పుణ్యభూమిలో మధ్యతరగతి సంస్కారం గల లక్ష్మిలాంటి అమ్మాయిలు అంతకంటె ఎక్కువగా ఏం ఆలోచించగలరు ?

కాని ఈ అర్థంలేని కట్టుబాట్లను, ఆడది బానిస అబల అన్న విషయాలను మరచి, తనచుట్టూ గిరిగీసికొని యున్న పరిథి నధిగమించి బయటుకువస్తే ఈ పురుషాధిక్యతగల సంఘంలోకూడా ఆడదాన్ని పురుషులతో సమానంగా చూసే అభ్యుదయ భావాలుకల యువకులుకూడా కొంతమంది ఉన్నారని అర్థమవుతుంది. కేవలం డబ్బుకొరకు అమ్ముచాటు పిల్లాడిలా నటించే మనోహర్ లాంటి కీటక సన్నాసులను పెళ్లి చేసికోవడం అవమానంగా యువతులు తలచాలి. వరకట్న దురాచార నిర్మూలనకై ప్రతినబూనుతూ, అభ్యుదయవాదులైన యువతీ యువకులు కట్నం కొరకు వ్యక్తిత్వం చంపుకొని అమ్ముడుబోయే యువకులను బహిష్కరించాలి. అపుడే ఇలాంటి కథలకు నిజమైన ముగింపు లభిస్తుంది.

(రచ్చబండ వారపత్రిక- మార్చి 83 సంచికలో)